

సమస్యలు పరిష్కరించండి..
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. బాధితులు కలెక్టర్ అనురాగ్ జయంతికి అర్జీలు పెట్టుకున్నారు. 8లో▸



'పది' సెకన్ల పరేషాన్
సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వాహనదారులకు చికాకు తెప్పిస్తోంది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/29.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి ఎక్కువవుతుంది. వడగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

టీచర్ సొసైటీ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల ప్రోగ్రెసివ్ టీచర్స్ సొసైటీ సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. స్థానిక శివ నగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చేతిరాత, స్పోకెన్ ఇంగ్లిష్, అబాకస్, బేసిక్ మ్యాథ్స్ ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. చేతి రాత బాగుంటే సబ్జెక్టుపై ఇష్టం ఏర్పడుతుందని, తద్వారా నైపుణ్యం పెరుగుతుందన్నారు. 210మంది విద్యార్థులు 3 బ్యాచ్ లుగా అభ్యసన చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్తు రవీందర్ మాట్లాడుతూ 14 మంది ఉపాధ్యాయులు ఉచిత సేవ అందించారని పేర్కొన్నారు. సొసైటీ ప్రధాన కార్యదర్శులు పాతూరి మహేందర్ రెడ్డి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మల్లారపు పురుషోత్తం, సలహాదారులు తాళ్లపల్లి శ్రీధర్, రాఘవేందర్, ఉపాధ్యక్షుడు బాలాగౌడ్, కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలి



మాట్లాడుతున్న సుమన్‌మోహన్‌రావు

వేములవాడఅర్బన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు అన్నారు. వేములవాడ బస్తీదవాఖానాలో ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఆసుపత్రుల్లోని వైద్య సేవలను వివరించాలన్నారు. క్షయ వ్యాధిని గుర్తించడంలో ప్రజలకు అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీరాములు, డీఐఓ డాక్టర్ మహేశ్, వైద్యాధికారి దివ్యశ్రీ, సూపర్‌వైజర్ ఝాన్సీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు..



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రణాళికతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని డీఈవో రమేశ్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పట్టణంలోని విద్యానగర్ బాలిక ఉన్నత పాఠశాలలో నగదు, ప్రశంసపత్రాలు అందించారు. 10 జీపీఏ నుంచి 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులు నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం భాగ్యరేఖ మాట్లాడుతూ.. మంచి అలవాట్లతో తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తేవాలన్నారు.

ఐకేపీ వీవోఏలపై చిన్నచూపు



సంఘీభావం ప్రకటించిన సీఐటీయూ నాయకులు

చందుర్తి(వేములవాడ): మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐకేపీ వీవోఏలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణతో కలిసి సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఇన్సూరెన్స్ పథకాన్ని రద్దు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వీవోఏల మండల సంఘం అధ్యక్షురాలు స్వరూప, ప్రధాన కార్యదర్శి వినోద, గంగ, మమత, పద్మ, రజిత, అజిదా తదితరులు పాల్గొన్నారు.

'సెస్' మహాసభ ఎన్నడో..!



సిరిసిల్ల 'సెస్' కార్యాలయం

జూన్‌లో మహాసభ నిర్వహిస్తాం..



జూన్‌లో 'సెస్' మహాసభ నిర్వహిస్తాం. విలేజి ప్రతినిధులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నాం. ఇది పూర్తి కాగానే వచ్చే నెలలో మహాసభను నిర్వహించి సంస్థ అభివృద్ధికి కీలకమైన నిర్ణయాలు మా పాలకవర్గం తీసుకుంటుంది.
– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్

వచ్చేనెల మహాసభకు సన్నాహాలు?

జిల్లాలో 'సెస్' మహాసభను నిర్వహించాలని పాలకవర్గం ఇటీవల నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు విలేజి ప్రతినిధులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో మహాసభను నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పాలకవర్గం, కొత్తగా ఎన్నికైనా ప్రతినిధుల కలయికకు ఈ మహాసభ వేదిక కానుంది. మహాసభలో కీలకమైన నిర్ణయాలతో సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.



సభ్యుల జాబితా

- గ్రామ ప్రాతినిధ్య సభ్యుల తొలి సమావేశానికి కుదరని ముహూర్తం
- గుర్తింపు కార్డులు జారీ చేస్తున్న సహకార సంస్థ
- మహాసభకు హాజరయ్యేందుకు సభ్యులు నిరీక్షణ

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలు అందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం మహాసభ నిర్వహణపై 'సెస్' పాలకవర్గం నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా కొలువుదీరిన పాలకవర్గం తొలి మహాసభను ఎప్పుడు నిర్వహిస్తారా..!! అని ఇటీవల ఎన్నికైన విలేజీ ప్రతినిధులు నిరీక్షిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు, 255 గ్రామాల్లో 'సెస్'సంస్థకు ప్రాతినిధ్య సభ్యులు ఉన్నారు. మొత్తం 467 మంది సభ్యులు ఉండగా.. వీరందరికీ ఐదేళ్ల పదవీకాలానికి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే మహాసభ నిర్వహించే అవకాశం ఉంది.

మహాసభ కీలకం..
'సెస్'లో ఏ కీలక పనిచేయాలన్నా మహాసభ తీర్మానం ఎంతో కీలకం. సంస్థ నిర్వహించే ఈ మహాసభకు కొత్తగా ఎంపికైన గ్రామ ప్రాతినిధ్య సభ్యులు హాజరవుతారు. మెజార్టీ సభ్యులు చేతులెత్తి.. లేదా చప్పట్లు కొట్టి ఆమోదిస్తేనే కీలకమైన పనులు ముందుకు కదులుతాయి. 'సెస్' పాలకవర్గం మహాసభలో తీర్మానాలపై ఆధారపడే నిర్ణయాలు తీసుకుంటున్నారు. సంస్థ బైలా ప్రకారం మహాసభ ఆమోదంలో విలేజీ ప్రతినిధులదే ముఖ్యభూమిక ఉంటుంది. వార్డుకు ఒక్కరు చొప్పున సిరిసిల్లలో 39 మంది, వేములవాడలో 28 మంది ప్రతినిధుల ఎన్నిక జరిగింది. జిల్లాలోని 255 గ్రామాల్లోనూ 'సెస్' ప్రాతినిధ్య సభ్యులున్నారు. జగిత్యాల జిల్లా పరిధిలోని కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయపల్లె, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామాలు 'సెస్' పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లోనూ ప్రతినిధులు ఉన్నారు. ప్రతి 250 విద్యుత్ కనెక్షన్ల కంటే తక్కువ ఉంటే ఒక్క ప్రతినిధిని ఎన్నుకున్నారు. మహాసభలో కీలక నిర్ణయాల్లో విలేజీ ప్రతినిధులు భాగస్వాములు అవుతారు.

అధికార పార్టీ వాళ్లే అధికం..
ఐదేళ్ల పదవీ కాలంలో ఉండే 'సెస్' విలేజీ ప్రతినిధుల ఎన్నికల్లోనూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలే ఎక్కువగా ఎన్నికయ్యారు. 2022 డిసెంబరు 25న జరిగిన 'సెస్' ఎన్నికల్లో 15 స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ రహితంగా సాగే ఈ ఎన్నికల్లో పార్టీ ప్రభావం కనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'సెస్'లో 2.80లక్షల మంది సభ్యులు ఉండగా.. కేవలం 87,130 మందికి మాత్రమే ఓటు హక్కు ఉంది. ఇటీవల ఎన్నికల్లో 73,694 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులకు 40,138 ఓట్లు రాగా.. బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు 18,853 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు 7,579 ఓట్లు వచ్చాయి. స్వతంత్రులకు 6,271 ఓట్లు రావడం విశేషం. గ్రామ ప్రతినిధుల ఎన్నికలోనూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులే ఎక్కువ మంది ఎన్నిక అయ్యారు. వీరంతా మహాసభకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నారు.

చిన్న కొండగట్టుగా అగ్రహారం

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు
- రెనోవేషన్ కమిటీ ప్రమాణాస్వీకారం

వేములవాడఅర్బన్: అగ్రహారంలోని శ్రీహనుమాన్ ఆలయాన్ని చిన్న కొండగట్టుగా తీర్చిదిద్దుతామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. అగ్రహారం హనుమాన్ ఆలయ రెనోవేషన్ కమిటీ సోమవారం ప్రమాణాస్వీకారం చేసింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవుడికి, భక్తులకు సేవచేయడం అదృష్టమని, కమిటీ సభ్యులందరూ సమష్టిగా ఆలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సీసీ కెమోరాలు, రేకులషెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, రూ.7లక్షలతో వారంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీలు మ్యాకల రవి, యేష వాణి, రెనోవేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, భూమేశ్‌గౌడ్, భాస్కర్ గౌడ్, నర్సింహరెడ్డి, అభిమన్యు, జల, శ్రీనివాస్, సత్యనారాయణ, రవిచందర్‌గౌడ్, సంజీవ్, వెంకటేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, జనార్దన్, సర్పంచులు పాల్గొన్నారు.



రెనోవేషన్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే రమేశ్ బాబు

దళితుల అభ్యున్నతి కోసమే దళితబంధు
వేములవాడరూరల్: రైతుబంధు, దళితబంధును తెచ్చిన కేసీఆర్ నిరుపేదలకు కొండంత ధైర్యాన్నిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎదురుగట్ల, నమిలిగుండుపల్లి, వట్టెంలలో మూడు దళిత యూనిట్లను సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో మొదటి దశ 10 యూనిట్లకు వందకోట్లు మంజూరయ్యాయని, రెండోవిడత 100 యూనిట్లు మంజూరవుతాయని తెలిపారు. జెడ్పీటీసీ యేష వాణి, సెస్ డైరెక్టర్ దేవరాజం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- అధికారులతో సమీక్ష

సిరిసిల్ల: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగంగా మంజూరు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు అన్ని అనుమతులు మంజూరుచేయాలని, టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పరిశ్రమల వివరాలు, అర్హతలు పరిశీలించాలని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా నిరుద్యోగులు, స్థానికులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. టీప్రైడ్‌లో భాగంగా రవాణా వాహనాల కొనుగోలుకు 19 మంది ఎస్సీ అభ్యర్థులకు రూ.63.33 లక్షలు, 11 ఎస్టీ యువకులకు రూ.38.58 లక్షలు మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రావు, ఎల్‌డీఎం మల్లికార్జున్, డీటీవో వై.కొండల్ రావు, కార్మిక, సెస్, కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, టీఎస్‌ఎస్‌ఐఐసీ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్



రాజన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. వేసవికాలం సెలవుదినాలు కావడంతో భక్తులు స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణ.. క్యూలైన్‌లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

- నేటి నుంచి 26వ తేదీ వరకు..
- జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి



జ్యోతి

సిరిసిల్ల: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ ఇస్తామని జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 16 నుంచి 26 వరకు కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, ఆసక్తి గల రైతులు ఆయిల్ పామ్‌సాగులో మెలకువలు తెలుసుకోవాలని వివరించారు. 16న నర్మాల, కస్బెకట్కూర్, అల్మాస్‌పూర్, మరిగడ్డ, కోనరావుపేట, 17న, సముద్రలింగాపూర్, పొత్తూరు, సిరిసిల్ల, వీర్నపల్లి, మద్దిపల్లి, 18న దమ్మన్నపేట, బోనాల, బద్దెనపల్లి, వెంకటాపూర్, నిజామాబాద్, శాత్రాజ్‌పల్లి, 19న పెద్దలింగాపూర్, ఆవునూరు, తంగళ్లపల్లి, కొదురుపాక, మూడపల్లి, సుద్దాల, బొల్లారం, 20న లింగన్నపేట, చీకోడు, నేరెళ్ల, గర్జనపల్లి, కోరెం, మల్యాల, నిమ్మపల్లి, వట్టెంల, 22న గంభీరావుపేట, రేపాక, నామాపూర్, జిల్లెల్ల, ఎల్లారెడ్డిపేట, 23న వల్లంపట్ల, మద్దికుంట, విలాసాగర్, బండపల్లి, బావుసాయిపేట, 24న ఇల్లంతకుంట, ముస్తాబాద్, బొప్పాపూర్, చందుర్తి, రుద్రంగి, 25న మల్లారెడ్డిపేట, పోత్గల్, బోయినపల్లి, మానాల, నాంపల్లి, 26న గాలిపల్లి, బందనకల్, తాడూరు, గొల్లపల్లి, కొలనూర్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు.

కంటి వెలుగులో 4,177 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగులో భాగంగా 4,177 మందికి కంటిపరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 550 మందికి రీడింగ్ కంటి అద్దాలు, 433 మందికి పాయింట్ అద్దాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 234 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో 75 రోజులుగా మొత్తంగా 2,78,182 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

సహకార సిబ్బందికి ఉద్యోగ భద్రత



ఉద్యోగ భద్రత పత్రాలు అందిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): సహకార సంఘాల్లో వివిధ హోదాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నట్లు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రతపత్రాలను సోమవారం అందించారు. జీవో నంబర్ 44 ప్రకారం రాష్ట్రంలోని వివిధ సహకార సంఘాల్లో పనిచేస్తున్న 4వేల మందికి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వరాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుకుంటున్నామని అనడానికి ఇదే నిదర్శనమన్నారు. సహకార ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పల్లెకు తడి, పొడి ఆదాయం..!

- జిల్లాలో 241 కంపోస్టు షెడ్ల పూర్తి
- 211 షెడ్లలో ఎరువుల తయారీ
- రూ.6.44కోట్లు విడుదల
- రూ.5.9కోట్ల ఖర్చుతో ఏర్పాటు
- ఏడాదికి రూ.23.67 లక్షల ఆదాయం
- మల్టీపర్పస్ వర్కర్లకు పెరిగిన వేతనాలు
- తడి, పొడి చెత్త సేకరణతో గ్రామాల్లో పరిశుభ్రత



తడి, పొడి చెత్తను వేరుచేస్తున్న కార్మికులు



ఎరువుల తయారీ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంపోస్టు షెడ్ల నిర్మాణాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తోంది. ఇలా వచ్చిన ఆదాయం పంచాయతీ అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. తద్వారా పల్లెల ముఖచిత్రమూ మారుతుతోంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 241 గ్రామాల్లో కంపోస్టు షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం 211 షెడ్లలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. జిల్లాలో మొదటగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో కంపోస్టు షెడ్డు అందుబాటులోకి వచ్చింది. అక్కడ ఎరువులను తయారు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లెల్లను ఆదర్శంగా తీసుకుని మిగిలిన గ్రామాల్లోనూ షెడ్లను ఏర్పాటు చేయడంతో ఎరువుల తయారీ జోరుగా సాగుతోంది. ఎరువుల ద్వారా సమకూరిన ఆదాయాన్ని ఇందులో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతినెలా రూ.8500 చొప్పున వేతనాలు అందిస్తున్నారు.

అధికారుల అవగాహన
గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై జిల్లా అధికారులు, మహిళా సంఘాలు, పాలకవర్గాలు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. కంపోస్టు షెడ్లలో తయారు చేసిన ఎరువును కిలోకు రూ.5 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఎరువులను రైతులు, హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీలలో ఉన్న మొక్కలకు ఉపయోగిస్తున్నారు.

తయారీ విధానం
గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను ముందుగా వేరు చేస్తారు. తడి చెత్త నుంచి మిగిలిపోయిన వ్యర్థాలను మట్టిగుంటలో వేసి రెండు వారాలు పేడనీటిని ప్రతిరోజూ చల్లుతారు. అందులో వానపాములను వేసి సంచులు కప్పుతారు. ఇలా 20 రోజులపాటు వేస్తారు. మూడు నెలల్లో అది పూర్తిగా ఎరువుగా మారుతుంది. దానిని మార్కెట్లో విక్రయిస్తారు. ఇక పొడి చెత్త నుంచి ప్లాస్టిక్, పాత బట్టలు, గ్లాసులు, పనికిరాని డబ్బాలు, అట్టలు తదితరాలను నిల్వ చేసి ఒకేసారి పెద్దమొత్తంలో విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని గ్రామాల అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా కంపోస్టు షెడ్ల వివరాలు..	
గ్రామపంచాయతీలు	255
మంజూరైన నిధులు	6.44కోట్లు
ఖర్చు చేసింది	5.79 కోట్లు
ఏర్పాటుచేసిన షెడ్లు	241
అందుబాటులోకొచ్చినవి	211
పెండింగ్‌లో ఉన్నవి	30
ఎరువు (కిలోకు)	రూ.5 నుంచి రూ.8 వరకు

ప్రతిరోజూ చెత్త సేకరణ



గ్రామంలో ప్రతిరోజు ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. రెండు రకాల చెత్త వేరు చేసే తడి చెత్తతో ఎరువులను తయారు చేస్తున్నాం. పొడి చెత్త ద్వారా లభ్యమైన వ్యర్థాలను గ్రామపంచాయతీలో నిల్వ చేస్తున్నాం.
– రామకృష్ణ, కార్యదర్శి, రాజన్నపేట

గ్రామ పంచాయతీకి ఆదాయం



మంత్రి కేటీఆర్ మా గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ముందుగా గ్రామంలో పరిశుభ్రత కోసం తడి, పొడి చెత్తను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టాం. తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాం. ప్రస్తుతం తడి చెత్తతో ఎరువులను తయారు చేస్తున్నాం.
– ముక్క శంకర్, సర్పంచ్, రాజన్నపేట

ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది



గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా సేకరించిన చెత్తతో ఆదాయాన్ని సమకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. జిల్లెల్లలో ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా విస్తరించాం. ఇలాంటి అవకాశాలను గ్రామపంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలి.
– చిరంజీవి, ఎంపీడీఓ, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

పేదల పక్షపాతి లక్ష్మారెడ్డి


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రయ్య

సిరిసిల్లటౌన్: పేదల పక్షపాతిగా సిరిసిల్లకు చెందిన సీనియర్ న్యాయవాది లక్ష్మారెడ్డి కీర్తిశేషులుగా మిగిలారని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రయ్య అన్నారు. సోమవారం సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో నిర్వహించిన లక్ష్మారెడ్డి సంతాపసభకు ఆయన హాజరై మాట్లాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన న్యాయవాదిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. రాజకీయాల్లో కూడా రాణించి ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మృతికి సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ నర్సింగరావు, లక్ష్మిప్రసాద్, సతీశ్‌సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కులను కాపాడేది కాంగ్రెస్సే..


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఉద్యోగుల హక్కులను కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగుల హక్కులు నిర్వీర్యమయ్యాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజ్ కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. వీవోఏలు సమ్మె చేస్తున్నా పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడం.. పేపర్ లీకేజీ చేయడం సాధారణంగా మారిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, షేష్‌గౌస్, బాబు, రామ్‌రెడ్డి, హిమామ్, భూమరెడ్డి, బుచ్చాగౌడ్‌ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్


ఆశీర్వచనం అందిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరఘువారెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి అద్దాల మండపంలో వారికి అశీర్వచనాలు ఇచ్చి.. రాజన్న ప్రసాదం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి..

- ప్రజావాణికి 15 ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సమస్యలు పరిష్కరించాలంటూ బాధితులు కలెక్టర్ అనురాగ్ జయంతికి అర్జీలు పెట్టుకున్నారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అధికార పార్టీకి అండగా ఉంటూ.. కొమ్ముకాస్తున్న సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ఆత్మీయసమ్మేళనానికి మూడురోజులపాటు ఫ్లెక్సీల ఏర్పాటుకు అవకాశమిచ్చారని, హనుమాన్ జయంతి సందర్భంగా సిబ్బందితో తీయించారని, మున్సిపల్ కమిషనర్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. కమిషనర్, టీపీవో, మేనేజర్‌పై చర్యలు తీసుకోవాని కోరారు.

స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం


కూతుళ్లతో కలిసి ప్రజావాణికి వచ్చిన లలిత

నాపేరు ఆడెపు లలిత. మాది వేములవాడ మండలం హన్మాజీపేట. మా ఇంటి స్థలాన్ని ఆక్రమించి తిరుపతి అనే వ్యక్తి గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా.. నిర్మాణం ఆపివేయాలని నోటీసు ఇచ్చినా పట్టించుకోవడంలేదు. ఇదే విషయంపై మార్చిలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కొన్నిరోజుల వరకు ఆపివేసి, మళ్లీ పనులు చేస్తున్నారు. ఒంటరి మహిళనైన నన్ను, నా ముగ్గురు కూతుళ్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

యారన్ సబ్సిడీ అడిగితే పనినుంచి తొలగించారు



నా పేరు కొలపాక లచ్చయ్య. 20 ఏళ్ల నుంచి పట్టణానికి చెందిన బూర కనకరాజేశం వద్ద నేత కార్మికుడిగా పనిచేస్తున్న. యారన్ సబ్సిడీ విషయంలో తప్పుడు లెక్కలు చూపినందుకు యజమానిని ప్రశ్నించగా.. పనిలో నుంచి తొలగించారు. నాలాంటి చాలా మంది కార్మికులను ఇలాగే తొలగించి బీహార్ కార్మికులను పెట్టుకుంటున్నాడు. అధికారులు స్పందించి, నాకు రావాల్సిన బకాయిలు, కార్మిక బెన్‌ఫిట్స్, యారన్ సబ్సిడీ, ఇప్పించి న్యాయం చేయాలి.

కలుషిత మాంసం విక్రయిస్తున్నారు



మటన్ మార్కెట్‌లో కలుషిత మాంసాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా.. పశువైద్యాధికారి పరీక్షంచకుండానే జీవాలను వధిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అనారోగ్యంతో ఉన్న జీవాలను వధించడం ద్వారా జనాలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

– ఎండీ.యూసుఫ్

బాపు నన్ను క్షమించు...

- పురుగుల మందు తాగిన కొడుకు
- ఫోన్‌లో తండ్రికి సమాచారం
- ఆన్‌లైన్ బిజినెస్‌లో మోసపోయానని ఆవేదన
- స్పందించి కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది


బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పుల బాధ ఎక్కువైంది. తట్టుకోలేకపోతున్న.. బాపు నేను సచ్చిపోతున్నానంటూ ఓ యువకుడు తన తండ్రికి ఫోన్‌చేసి చెప్పడంతో ఆవేదనతో తండ్రి డయల్100కు ఫోన్ చేసి తన కొడుకును కాపాడాలని వేడుకున్నాడు. దీంతో స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది యువకుడిని ఆసుపత్రికి సకాలంలో తరలించి ప్రాణాలు కాపాడిన ఘటన ముస్తాబాద్ మండలంలోని మద్దికుంటలో చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన అర్వ క్రాంతికుమార్(31) ముస్తాబాద్ మండలం మద్దికుంట వద్ద సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈక్రమంలో ఛాతిలో నొప్పి భరించలేక తన తండ్రి అర్వ రామచంద్రారెడ్డికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో రామచంద్రారెడ్డి డయల్100కు ఫోన్‌చేసి తన కొడుకు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ముస్తాబాద్ శివారులో ఆటోలో ఉన్నాడని తెలపడంతో పోలీస్ అధికారులు ముస్తాబాద్ ఠాణా బ్లూకోల్ట్ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన బ్లూకోల్ట్ పీసీ ఖాసీం క్రాంతికుమార్ కోసం తీవ్రంగా గాలించాడు. చివరకు మద్దికుంట శివారులో క్రాంతికుమార్‌ను గుర్తించారు. వెంటనే బాధితుడిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం క్రాంతికుమార్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. క్రాంతికుమార్ ఆన్‌లైన్‌లో బిజినెస్ చేసి మోసపోయానని, లక్షల్లో అప్పు ఉండడంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులకు తెలిపాడు. సకాలంలో స్పందించిన బ్లూకోల్ట్ పీసీ ఖాసీం, హోంగార్డు రాజును ఎస్పీ అఖిల్ మహాజన్, సీఐ ఉపేందర్ అభినందించారు.

ఉపాధి హామీ కూలీకి గాయాలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని భూక్య తండాలో మాలోత్ లక్ష్మి అనే మహిళ ఉపాధి హామీ పని చేస్తుండగా వద్ద గాయపడింది. గ్రామంలో పెంకాస్‌కుంటలో పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. దీంతో ఆమె చేయి విరిగింది. స్థానికులు ఆమెను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా టేకు దుంగలు తరలింపు?


గండిలచ్చపేట గ్రామం నుంచి తరలిస్తున్న టేకు దుంగలు

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామశివారు అటవీప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా విలువైన టేకుదుంగలను తరలిస్తూ.. పలువురు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం గ్రామస్తుడు ఒకరు టేకు దుంగలను తరలిస్తుండగా కొందరు వ్యక్తులు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టుచేయడంతో ఈ విషయం బయటపడింది. అటవీ సంపదను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజన్న ఆలయంలో అనుమానితుల చేతివాటం

- 35 వేల నగదు స్వాధీనం..

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ సోమవారం అధికంగా ఉంది. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో వీరినుంచి రూ.9వేలు చోరీకి గురైనట్లు గుర్తించి అక్కడే ఉన్న భద్రత సిబ్బందికి తెలిపారు. దీంతో వారు కోడెమొక్కులు సమర్పించే సమయాన్ని గుర్తించి సీసీ కెమెరాల్లో అనుమానితుల్ని పట్టుకున్నారు. వారిని సోదా చేయగా రూ. 35వేల నగదు లభించింది. సదరు నిందితులు ఒకరు వేములవాడ కాగా మరొకరిది, మంచిర్యాల జిల్లాగా గుర్తించి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకుని వేములవాడ టౌన్ పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మ సాకేత్, మాందాల జాషువా ద్విచక్ర వాహనంపై సిరిసిల్లకు వెళ్లి ఇంటికి వస్తున్నారు. కొలనూర్ శివారులో రైసుమిల్లు వద్ద నిలిపిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి.. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఎల్లారెడ్డిపేటలో క్రీడలను ప్రారంభిస్తున్న ఆగయ్య


క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడలతో నైపుణ్యం పెరుగుతుందని, మానసికోల్లాసం కలుగుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుకా, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేటలో సీఎం కప్ 2023లో భాగంగా మండలస్థాయి క్రీడాపోటీలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో సత్తాచాటి జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రాణించాలన్నారు. మండల స్థాయిలో రాణించిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

ఇల్లంతకుంట: క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీఎం కప్ ట్రోఫీ క్రీడాపోటీలను సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కేసీఆర్ సీఎం అయ్యాక గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని, ప్రభుత్వం సాయం అందిస్తున్నారని తెలిపారు. ఊరూరా గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీఓ మీర్జా, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, ఎస్సై రాజేశ్, ఉపసర్పంచ్ సాదుల్, తదితరులున్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: సీఎం కప్ పోటీలను మండలకేంద్రంలోని క్రీడా ప్రాగణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. క్రీడాకారులు భారీగా తరలివచ్చారు.

దర్గావలికి సందల్ సమర్పణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారం శివారు దర్గావలి గుట్టపై సోమవారం ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రం నుంచి సందల్ (గంధం)ను భారీ ఊరేగింపుగా గుట్ట వరకు తీసుకెళ్లారు. దర్గావలికి సందల్ సమర్పించి మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముంబయి కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకుడు అజీజ్‌బాయి భక్తులకు అన్నదానం చేశారు. రెండోరోజుతో ఉర్సు ఉత్సవాలు ముగిసినట్లు మత పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నిర్వహణ కమిటీ సభ్యులు గౌస్, అశోక్, మల్లేశం, చంద్రం, బాలయ్య, శ్రీనివాస్, నారాయణగౌడ్, ఉస్మాన్, భాస్కర్, మత పెద్దలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేట నుంచి సందల్ ఊరేగింపు

‘పది’ సెకన్ల పరేషాన్

- ఆపేది ఎక్కువ.. పంపేది తక్కువ
- చికాకు తెప్పిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


వాహనాలు వెళ్లడానికి 15 సెకన్ల సమయం చూపుతున్న ట్రాఫిక్ సిగ్నల్స్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వాహనదారులకు చికాకు తెప్పిస్తోంది. వాహనాలను నిలిపేందుకు ఏర్పాటుచేసిన సమయంలో నిమిషం ఉంటే.. నిలిచిన వాహనాలు వెళ్లేందుకు కేవలం 15 సెకన్ల సమయం ఇవ్వడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కార్లు, బస్సులు, ట్రాక్టర్ ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడగానే నిలిపి మళ్లీ 15 సెకన్ల ముందుకెళ్లేందుకు సమయం సరిపోవడం లేదని ఈ సమయాన్ని కాస్త పెంచాలని డ్రైవర్లు కోరుతున్నారు.

రోడ్డు ఆక్రమణలతో మరో సమస్య..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట రోడ్ల ఆక్రమణ అధికంగా ఉంది. ఏదేని సమావేశం నిర్వహించడం, పోలీసు అధికారులు చెప్పిన రోజు మినహా నేతన్న చౌరస్తా వద్ద రోడ్డును ఆనుకుని ఆటోలు, పండ్ల వ్యాపారులు ఆక్రమణతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్రీ లెఫ్ట్ వెళ్లే వాహనదారులకు ఇవి అడ్డంకిగా మారాయి. ఇక్కడే ఉన్న ఓ హోటల్ వద్ద వాహనాల నిలుపుదల కనిపించిన పోలీసులు ఎందుకో మిన్నకుంటున్నారు. రహదారి వెంట ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన అడిగేవారే లేరు. అంతేకాకుండా పూల దుకాణాలు, కొబ్బరి బొండాల దుకాణాలు ఏర్పాటుచేసుకున్నప్పటికీ చర్యలు తీసుకున్నవారు లేకుండాపోయారు. ఇదేమని వాహనదారులు వ్యాపారులను అడిగితే జిల్లాలో దాదాపు అన్ని కార్యాలయాలకు పానియాలు, ఆహారం, టిఫిన్స్ అందించేది తామేనని దానికి ప్రతిఫలంగానే అధికారులు సహకరిస్తారని చెబుతున్నారు. ఇంకొంతమంది తాము ఏళ్లుగా చిరు వ్యాపారాలు ఇక్కడే చేస్తున్నామని, ఇప్పుడు సిగ్నల్స్ ట్రాఫిక్ పేరిట తమపై ఒత్తిడి పెంచి వెళ్లాలంటే తమకు స్థలం చూపించాలని కోరుతున్నారు.

సమయాన్ని మార్చేందుకు కృషి



ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అంటే ప్రమాదాలను నివారించాలనేది మా ప్రయత్నమే కానీ వాహనదారులకు ఇబ్బందులకు గురిచేయడం కాదు. వాహనాలు వెళ్లడానికి ప్రస్తుతమున్న 15 సెకన్ల వ్యవధిని పెంచేందుకు ఉన్నతాధికారులను అడిగి చర్యలు తీసుకుంటాం. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసేవారికి హెచ్చరికలు జారీచేశాం. ట్రాఫిక్ అంతరాయం కలిగించే విధానాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– రాజు, ట్రాఫిక్ ఎస్సై, సిరిసిల్ల

అర్హులకు పట్టాలివ్వాలి

- వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము..

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపు గ్రామాల్లోని అర్హులైన నిర్వాసితులకు పట్టాలు ఇవ్వాలని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. వేములవాడ తహసీల్దార్ రాజుకు సోమవారం వినతిపత్రం అందించి మాట్లాడారు. చింతల్‌ఠాణా గ్రామంలో అక్రమంగా పట్టాల మార్పిడి చేస్తున్నారన్నారు. అమాయకుల వద్దనుంచి పట్టాలను కొందరు కొనుగోలు చేసి వాటిని మెయిన్ రోడ్డుకు మార్పిడి చేసుకుని లక్షలు దండుకుంటున్నారన్నారు. అధికారులు విచారణ చేసి అక్రమంగా మార్పిడి చేసిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. అర్హులకు ఇప్పటికి పరిహారం అందలేదని వెంటనే పరిహారంతో పాటు పట్టాలు అందించాలని కోరారు. సీఎం కేసీఆర్ నిర్వాసితులకు ఇచ్చిన హామీ ప్రకారం.. రూ. 5.04 లక్షలు అందించి నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల చుట్టూ హద్దులు లేక భూములను కొందరు ఆక్రమిస్తున్నారని వెంటనే హద్దులు ఏర్పాటుచేయాలని కోరారు.


తహసీల్దార్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

వర్కర్ టూ ఓనర్ ప్రారంభించాలి

- నేతన్నలకు యారన్ సబ్సిడీ ఇవ్వాలి
- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్


మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: రాష్ట్రప్రభుత్వం సిరిసిల్లలో వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి వర్కర్ టూ ఓనర్ పథకం ఆరంభానికి నోచుకోవడం లేదని, దీనికి మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ చీరలు నేసే కార్మికులకు సర్కారు ప్రకటించిన పదిశాతం యారన్ సబ్సిడీ మూడేళ్లుగా అందడం లేదన్నారు. ప్రభుత్వం నాన్చుడు విధానాలు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. బుధవారం సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నక్క దేవదాసు, గుండు రమేశ్, ఒగ్గు గణేష్, బెజుగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం

- అనారోగ్యం బారిన పడిన క్లాస్‌మెట్‌కు తోటి మిత్రుల చేయూత
- రూ.లక్ష ఆర్థిక సాయం..

రుద్రంగి(వేములవాడ): పక్షవాతం వచ్చి అనారోగ్యం భారిన పడి ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని అప్పుల పాలైన క్లాస్‌మెట్‌కు తోటి మిత్రులు చేయూతనందించారు. ఉపాధి కోసం సౌదీ వెళ్లిన తోటి మిత్రులు, కలిసి పని చేసిన మరికొందరు మిత్రులు సౌదీలో రూ.లక్ష విరాళం సేకరించి గడ్డం మహేందర్‌కు ఆర్థికంగా అండగా నిలిచారు. సోమవారం రుద్రంగిలోని క్లాస్‌మెట్స్‌తో నగదును మహేందర్‌కు అందించారు. ఆస్పత్రి ఖర్చులతో అప్పుల పాలై కుటుంబ పోషణ భారంగా మారిన నిరుపేద మహేందర్ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఆర్థికసాయం అందించిన వారిలో రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో 1991–92 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఉన్నారు.


మహేందర్‌కు నగదు అందిస్తున్న మిత్రులు

రోడ్లపై ప్రమాద హెచ్చరికల బోర్డులు

- ప్రగతిలో ఉన్న పనులు పూర్తిచేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ప్రమాదకర రోడ్లపై మూలమలుపుల వద్ద బ్లాక్ స్పాట్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం జిల్లా అధికారులతో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ చేపట్టిన 19 రోడ్ల పనుల్లో 14 పనులు పూర్తయ్యాయని, మిగితా పనులు నెలరోజుల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. వేములవాడ మూలవాగుపై వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. సిరిసిల్లలోని రెండు బైపాస్ రోడ్లకు తుది లేయర్ వేయాలని, డివైడర్ అభివృద్ధి, ప్లాంటేషన్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీలను పూర్తి చేయాలని, మానాల–మరిమడ్ల, చందుర్తి–మోత్కురావుపేట, జిల్లెల్ల–ముస్తాబాద్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, ‘మన ఊరు.. మన బడి’లో చేపట్టిన పనులను స్కూళ్లు తెరిచే నాటికి పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, అటవీశాఖ అధికారి బాలమణి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, డీటీవో వై.కొండల్‌రావు, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, మిషన్ భగీరథ ఈఈ జానకీ, డీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్య కార్మికుడు పండుగ నరేందర్ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.